
www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 7 నవంబర్ 2024

5

తిరుపతి



నిబంధనల మేరకే అనుమతులు : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో నిబంధనల మేరకు అన్నీ సక్రమంగా ఉంటేనే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. నగరంలో అనధికారిక అపార్ట్మెంట్ల నిర్మాణం, ప్రకటన బోర్డుల రెన్యువల్, భవన నిర్మాణ ప్లాన్ అనుమతులు, తదితర అంశాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో బుధవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నగర పరిధిలో దరఖాస్తు చేసిన భవన నిర్మాణాలు, అపార్ట్మెంట్ల నిర్మాణాలకు నిర్దేశిత గడువులోగా తగిన అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డి.సి.పి. మహాపాత్ర, ఏ సి పి బాలాజి, రమణ, సర్వేయర్ కోటేశ్వర రావు ఉన్నారు.

కీచక 'మృగాళ్లు'..!



పసిమొగ్గలపై అకృత్యాలు

వరుస ఘటనలతో ఉలికిపాటు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

చిన్నారులను చిదిమేయాలన్న కీచకుల నీచ ఆలోచన జిల్లా ప్రజానీకాన్ని ఉలికిపాటుకు గురిచేస్తోంది.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత కొన్ని నెలలుగా పసిమొగ్గలపై జరుగుతున్న అకృత్యాలు తల్లిదండ్రులను బెంబే లెత్తిస్తోంది. బయటకు వెళ్లిన కుమార్తె ఇంటికి ఏ ఇబ్బందీ లేకుండా తిరిగి వస్తుందన్న నమ్మకాన్ని ఇటీవల జరిగిన ఘటనలు పోగొట్టాయి. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న బిడ్డలపై మన చుట్టూ తిరుగుతూనే మృగాలు దాడికి పాల్పడుతున్నాయి. అయితే వీటిని అరికట్టాల్సిన పాలకులు, ఘటనలను రాజకీయం చేస్తూ, పోలీసుల వైఫల్యంగా వారిపై నెట్టేస్తుండటం గమనార్హం. గంజాయి, మద్యం మత్తులోనే ఈ ఘటనలు జరుగుతున్నాయన్నది ప్రతిపక్షాల ఆరోపణ.

తిరుపతి జిల్లా ప్రశాంతతకు నిలయం. ప్రసిద్ధిగాంచిన జిల్లాలో ఇటీవల బాలికలపై వరుసుగా చోటు చేసుకుంటున్న ఘటనలు ప్రజలను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. జూలై నెలలో తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి గ్రామ సరిహద్దుల్లో ఉన్న రైస్‌మిల్లు అటవీప్రాంతంలో 8 ఏళ్ల చిన్నారని, బీహార్‌కు చెందిన ఓ యువకుడు గంజాయి మత్తులో అపహరించి, అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటన జరిగింది. ఏర్పేడు మండలం మునగలపాలం పంచాయతీ పరిధిలోని మూల కండ్రిగ గ్రామంలో చిన్నారులపై లైంగికవేధింపులు జరిగాయి. బలరామయ్యగౌడ్ అనే మానవమృగం ఈ దారుణానికి ఒడిగట్టాడు. గూడూరు రెండో పట్టణ పరిధిలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ బాలికను ఓ రౌడీషీటర్ బాలిక ఇంటి ముందే కత్తితో బెదిరించి, బలవంతంగా ఆటోలో ఎక్కించుకునిపోయి అత్యాచారం చేసి, సాయంత్రం ధైర్యంగా కిడ్నాప్ చేసిన పరిసరాల్లో వదిలేసి జారుకున్నాడు. ఈ ఘటనతో అవమానాన్ని భరించలేక బాధితురాలు పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. జూలై నెలలోనే చిత్తూరులో తనవద్ద పని చేసే మైనర్ బాలికపై ఆర్ఎంపి వైద్యుడు ఆఘాయిత్యానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల విచారణలో అతను పలుమార్లు బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చిందని వెల్లడైంది. అక్టోబరు నెలలో పుంగనూరులో ఆరేళ్ల చిన్నారి తప్పిపోయింది. తొలుత పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. దర్యాప్తు పూర్తి అయ్యేలోపు పాప శవమై తేలింది. దీపావళి రోజు వడమాలపేట మండలంలోని ఎస్‌టి కాలనీలో 3 ఏళ్ల చిన్నారిపై మామ వరుసైన వ్యక్తి చాక్లెట్లు ఆశచూపి అత్యాచారానికి పాల్పడి, అటుపై మురికికాల్వలో తొక్కి హత్య చేసిన ఘటన ప్రతి ఒక్కరి కంట నీరు తెప్పించింది. 9వ తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం చేసి ఆపై పోలీసులు, ఊరు పెద్దల మధ్యస్తం చేసి ఆ బాలికకు 30వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించిన ఘటన ఈ నెల 2వ తేది వెలుగు చూసింది. ఈ నెల 3వ తేదీ జీవకోనకు చెందిన 9వ తరగతి చదువుతున్న బాలికను రాజమండ్రికి చెందిన ఓ యువకుడు చెన్నయ్‌లోని హోటల్‌లో పని చేస్తూ ఆన్‌లైన్ ద్వారా పరిచయం పెంచుకుని, తిరుపతి సమీపంలోని ఓ హోటల్‌కు బాలికను మాయమాటలు చెప్పి పిలిపించుకుని, అత్యాచారానికి పాల్పడిన ఘటనలో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. తాజాగా ఈ నెల నాలుగో తేది ఎర్రవారిపాళెం మండలం యలమంద గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని స్కూల్ నుంచి ఇంటికి వస్తుంటే ఇద్దరు యువకులు అడ్డగించి, బలవంతంగా మత్తు మాత్రలు తాగించి, దాడి చేసి రోడ్డుపక్కన పడదోసి వెళ్లిన ఘటన అనుమానాస్పద రీతిలో జిల్లాలో సంచలనం కల్గించింది. ఇవి అధికారికంగా పోలీసుల కేసు నమోదు చేసిన ఘటనలు. కేసు నమోదు చేయనవి ఎన్నో.

మునగలపాలెంలో చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడు గతంలోనూ ఇలాంటి దారుణానికి పాల్పడి, జైలు శిక్ష అనుభవించిన పరివర్తన లేదు. పైగా అతనిపై కనీస నిఘా కూడా లేదు. గుడూరులో ఘటనలో గత మూడేళ్లుగా నిందితుడు వేధిస్తున్నా ఎలాంటి చర్యలు లేవు. ఇలాంటి ఘటనలపై పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి, పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలి. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేస్తే కొంత మార్పు తీసుకురావచ్చని ప్రజాసంఘాలు కోరుతున్నాయి. ఆ దిశగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం...!

ఇంట్లోనుంచి వెళ్లకపోతే బాగుండేది

చంద్రముఖిదేవి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలి వ్యాఖ్యలు


ఉత్తరప్రదేశ్‌లో హత్యాచారానికి గురైన 50 ఏళ్ల మహిళపై గతంలో జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సదరు మహిళ ఇంటినుంచి బయటకు రాకుండా ఉంటే అసలు ఈ ఘటనే జరిగేది కాదని చంద్రముఖిదేవి వ్యాఖ్యానించారు. ప్రతిసారీ తాను మహిళలకు ఒకటే చెబుతున్నానని, ఎలాంటి పరిస్థితుల్లోనూ అనవసర సమయాల్లో బయటకు వెళ్లొద్దు అని సూచించారు. ఆదివారం గుడికి వెళ్లిన మహిళను పూజారి, మరో ఇద్దరు రేప్ చేసి చంపేసిన ఘటనపై ఆమె చేసిన వ్యాఖ్యలు పై విధంగా ఉన్నాయి. మనువాదం రాజ్యమేలుతున్న నేపథ్యంలో జాతీయ మహిళా కమిషన్ సభ్యుల నుంచి ఇంతకంటే వేరే వ్యాఖ్యలు వస్తాయని ఆశించడం పొరబాటే.

(ఫైలింగ్)

భక్తుల సేవకు సమిష్టి కృషి

టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - తిరుమల



ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడుకోవడమే ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి ప్రాధాన్యత అని టీటీడీ నూతన ధర్మకర్తల మండలి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు తెలియజేశారు. భక్తుల సేవకు సమిష్టి కృషి అవసరం అన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం బుధవారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన తొలిసారిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. తాను చిన్నప్పటి నుండే ప్రతి సంవత్సరం శ్రీవేంకటేశ్వర స్వామిని కాలినడకన వచ్చి దర్శించుకునేవాడినని, ప్రస్తుతం తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సేవ చేసుకునే అరుదైన అవకాశాన్ని శ్రీవారు ప్రసాదించడం పూర్వజన్మ సుకతమన్నారు. భక్తులకు సేవ చేసేందుకు మీడియాతో సహా ప్రతి ఒక్కరూ తోడ్పాటు నందించాలని కోరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత నెలలో బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అధికారులు సమిష్టి కృషిని కొన సాగించాలని ఆకాంక్షించారు. అంతకుముందు టీటీడీ సీనియర్ అధికారులందరితో ఛైర్మన్ పరిచయ సమావేశం నిర్వహించారు. టీటీడీ ఈవో జె.శ్యామలరావు టీటీడీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ సమర్పించారు. టీటీడీ అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిఎల్ఓ వరప్రసాదరావు, సిఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ప్రాంతీయ సిపిఎం కార్యదర్శిగా గంధం మణి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



క్షేత్ర స్థాయి నుంచే దోపిడీ, అంటరానితనం, వ ం తో న్నా ృ దా న్న అడ్డుకునేలా భవిష్యత్ పోరాటాలకు శంఖారావం మోగిస్తున్నట్లు సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీ స్పష్టం చేసింది. ప్రజా సమస్యల పరిష్కారం.. ఎన్నికల హామీల అమలుపై అలుపెరుగని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చింది. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో బుధవారం సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ ప్రప్రథమ మహా సభ జరిగింది. శ్రీకాళహస్తి రూరల్ మండలం, అర్బన్, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల సీపీఎం శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ సోషల్ మీడియాలో అశ్లీలత, మాదక ద్రవ్యాల విచ్చలవిడితనం వల్ల యువత పెడదోవ పడుతోందనీ, ఫలితంగా సమాజంలో నేరాలు పెచ్చుమీరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రజెండా ప్రజలకు ఎపుడూ అండగా ఉంటుందన్నారు. సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రాంతీయ కార్యదర్శిగా గంధం మణి, సభ్యులుగా పెనగడం గురవయ్య, ధనంజయలు, కుమార్, వెంకటేష్, రాధమ్మ, శ్రీనివాసులు, రమణయ్య ఎన్నికయ్యారు.



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా, కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కలెక్టరేట్‌ను ముట్టడించిన విద్యార్థులు


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ అక్బర్, బి రవి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచిపోతున్నా విద్యారంగ సమస్యలు ఎక్కడికక్కడ అలానే కూరుకుపోయాయి. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో మూడు విడతలు విద్యా, వసతి దీవెన బకాయిలు 3,480 కోట్ల రూపాయలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల ఒత్తిడి భరించలేక మానసికంగా కుంగిపోతున్నారన్నారు. తల్లికి వందనం పథకాన్ని తక్షణం అమలు చేయాలన్నారు. గత తొమ్మిది నెలలుగా మెస్సు ఛార్జీలు రాకపోవడంతో హాస్టల్ వార్డెన్ల అవస్థలు వర్ణనాతీతమన్నారు. కనీసం తాగడానికి మంచినీరు లేని హాస్టల్స్ ఉన్నాయన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, సంక్షేమ హాస్టల్‌కు సొంత భవనాలు కేటాయించాలని, మెస్సు ఛార్జీ బకాయిలు చెల్లించాల్నఇ, యూనివర్సిటీలలో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, జీవో నంబర్ 77ను రద్దు చేసి, పీజీ చదివే విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

'లాయల్ టెక్స్‌టైల్' దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - నాయుడుపేట

తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో లాయల్ టెక్స్‌టైల్ కార్మికులు బుధవారం కంపెనీ యాజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. చట్టపరంగా తమకు రావాల్సిన రాయితీలు ఏమీ ఇవ్వకుండా లాకౌట్ చేశారంటూ కార్మికులు మండిపడ్డారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ డిసిఎల్, ఎసిఎల్‌కు లాయల్ పరిశ్రమ యాజమాన్యం చేసిన అన్యాయంపై అర్జీలు ఇచ్చి మూడు నెలలు పూర్తవుతున్నా స్పందన లేదన్నారు. యాజమాన్యంతో చర్చలు జరిపి న్యాయం చేస్తామని చెప్పి ఆరు పర్యాయాలు చర్చలకు పిలిచి వాయిదా వేశారన్నారు. మేనకూరు సెజ్‌లో అనేక పరిశ్రమలు ఇక్కడి కార్మికుల కష్టంతో నడుపుకుంటూ కార్మికుల శ్రమతో వచ్చిన ఆదాయాన్ని మూటగట్టి సొంతరాష్ట్రాలకు తరలించుకు పోతున్నారన్నారు. కార్మికుల పొట్టగొడుతున్నారన్నారు. కార్మికుల శ్రమకు చట్టపరంగా ఇవ్వాల్సిన రాయితీలు ఇవ్వకుండా మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్మికుల పొట్టగొట్టిన లాయల్ టెక్స్‌టైల్ య ఆజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమిళనాడు నుండి వచ్చి పరిశ్రమ పెట్టి, లాభాలను వారి రాష్ట్రానికి తరలించుకుపోతుంటే లేబర్ అధికారులు చూస్తూ ఊరుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రత్నమ్మ, దీప, శివ, సుగుణమ్మ పాల్గొన్నారు.



తప్పు చేయకుండా ఎలా తొలగిస్తారు..?

ఏపీఎంను నిలదీసిన గ్రామస్తులు

సంఘమిత్రకు డ్వాక్రామహిళల అండ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులకు ఆయా శాఖల అధికారులు ఎలా సహకరిస్తున్నారో తొట్టంబేడు మండలంలోని తాటిపర్తి గ్రామంలో బుధవారం నిర్వహించిన పొదుపు సంఘాల వీవో సమావేశం ఓ సాక్ష్యంగా నిలిచింది. ఆ పంచాయతీ సంఘమిత్ర రేవతి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన రోజు నుంచి రాజకీయ వేధింపులు ఎదుర్కొంటోంది. ఆమెపై తప్పుడు ఫిర్యాదులు చేసి విధుల నుంచి తొలగించాలని స్థానిక అధికార పార్టీ నేతలు ప్రయత్నిస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలో రేవతి ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసింది. అయినా పట్టించుకోని అధికార పార్టీ నేతలు మరోమారు ఆమెపై ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. ఆమెను ఎలాగైనా తొలగించాలంటూ హుకూం జారీ చేశారు. దీంతో తొట్టంబేడు వెలుగు శాఖ ఏపిఎం ఇందిర తాటిపర్తిలో వివో సమావేశం ఏర్పాటు చేసి రేవతి అంశంపై చర్చ లేవనెత్తారు. ఆమెపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయనీ, తొలగించే క్రమంలో పొదుపు సంఘాల సభ్యులు లీడర్ల అభిప్రాయాలు తెలుసుకుంటున్నామని చెప్పారు.



అయితే దీన్ని పొదుపు మహిళలు ముక్తకంఠంతో ఖండించారు. రుణాలు తీసుకునేది మేమే.. కట్టేది మేమే..!! మరి మధ్యలో రాజకీయ నాయకులకు పనేంటని ప్రశ్నించారు. పొదుపు సంఘాలు నడుపుతోంది రాజకీయ నాయకులా, వెలుగు శాఖా అంటూ నిలదీశారు. తాము తీసుకున్న రుణాలు రాజకీయ నాయకులకు కట్టడం లేదనీ, తమ సంఘమిత్ర సక్రమంగా విధులు నిర్వహిస్తోందనీ, మరి ఏ ఉద్దేశంతో ఆమెను తొలగిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. అసలు ఆమె తప్పు చేస్తే తామే ఫిర్యాదు చేస్తాం కదా..? మధ్యలో రాజకీయ నాయకులకు, అధికారులకు ఏం పని అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సంఘమిత్రను తొలగిస్తే ఊరుకోమని హెచ్చరించారు. దీంతో వారిపై ఏపిఎం ఆగ్రహంతో ఊగిపోయారు. సంఘమిత్ర అంశంపై ప్రశ్నించే హక్కు గ్రామ పెద్దలకు ఉందంటూ పరోక్షంగా అధికార పార్టీ నేతలకు మద్దతు పలికేలా మాట్లాడారు. ఈ విషయంపై సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ అధికార పార్టీ నేతలకు సహకరిస్తూ, రేవతిపై అధికార వేధింపులకు పాల్పడుతున్న ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మురికివాడలు 'మురుగు'మయం

ప్యాచ్‌వర్కులతోనే రోడ్ల గుంతలు సరి

స్టాండింగ్ కమిటీ ఎన్నికలపైనా వైసిపి పట్టు

బిల్లులు రాక కాంట్రాక్టర్లలో నిరుత్సాహం

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం



ఏ మురికి వాడ చూసినా ఏమున్నది గర్వకారణం... సందులు గొందులన్నీ మురుగుమయం

రైల్వే కాలనీలో ఇళ్ల మధ్యనే చెరువును తలపిస్తున్న చిన్న సందులో మురుగునీరు.. అక్కడే తాగునీటిని పట్టుకుంటూ...

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో భూగర్భడ్రైనేజికి, రహదారుల గుంతలకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో మురికివాడలు 'మురుగు'మయమై దుర్గంధభరితంగా ఉంటున్నాయి. యుడిఎస్ నిండిపోయిందని ఫోన్ చేస్తే తాత్కాలికంగా తొలగిస్తారు. రెండు మూడు రోజుల్లో యథాప్రకారం మళ్లీ మురుగునీరు పైకి ఎగదన్నుతుంది. ఇక రహదారుల పరిస్థితి అంతే. గుంతలయమైన రోడ్లకు ప్యాచ్‌వర్కులతో సరిజేసే ప్రయత్నం చేశారు. అయితే కొన్ని ప్యాచ్‌వర్కులు నాశిరకంగా ఉండడంతో వేసిన మూడు రోజులకే యథాతథంగా గుంతలుగా ఉంటున్నాయి. మరోవైపు ఈ ప్యాచ్‌వర్కులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో వారిలో నిరుత్సాహం నెలకొంది. వర్షం వచ్చిందంటే యుడిఎస్ పొంగి పొర్లడంతో ఆ రహదారుల్లో నడవడం ఇబ్బందికరం. ఇదీ మన స్మార్ట్‌సిటీ తిరుపతి మురికివాడల చరిత్ర. ఎన్నిసార్లు మురుగు తొలగించినా యథారాజా తథాప్రజా అన్న చందంగా మురుగు రోడ్లపై ప్రవహిస్తూనే ఉంటుంది. మరోవైపు ఈ మురుగునీరు తాగునీటిలో కలిసిపోవడంతో తెలుగుగంగ నీరు తాగే ప్రజలకు రోగాలు రాక తప్పదు. ఇదిలా ఉండగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు అక్టోబర్ మొదటివారంలో జరగాల్సి ఉండగా 'కోరం' లేని కారణంగా టిడిపి కూటమి వాయిదా వేసింది. ఈ విషయమై గురువారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు పట్టుబట్టే అవకాశం ఉంది. 15 అంశాలతో కూడిన అజెండాను రూపొందించారు. 3, 4 డివిజన్లలకు కూటమికి చెందిన వారు ఎక్కువ పనులు కేటాయించారని, మిగిలిన డివిజన్లలో తక్కువ పనులు అజెండాలో పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసిపి హయాంలో ఇచ్చిన టిడిఆర్ బాండ్లపైనా చర్చ జరిగే అవకాశం ఉంది. దాదాపు 2,500 మందికి టిడిఆర్ బాండ్లు ఇచ్చారు. మిగిలిన 800 మందికి ఇవ్వాల్సి ఉంది.

నిత్యం ప్రజా సమస్యలపై ప్రజా పరిష్కార వేదికలో అర్జీలను స్వీకరించడమే తప్ప, ఆ పనుల పరిష్కారానికి ఖజానా ఖాళీగా ఉందని సమాచారం. దీంతో అభివృద్ధి పనులకు, సమస్యల పరిష్కారానికి బ్రేక్ పడిందని తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా చిన్న చిన్న పనులు తప్ప డివిజన్లలో పెద్దఎత్తున పనులు జరగలేదు. చిన్నపాటి వర్షం వస్తేనే మురుగునీరు పొంగి ప్రవహించి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. మరోవైపు ఈ వ్యవస్థ శాశ్వత పరిష్కారానికి పాలకులు ఎటువంటి చొరవ చూపకపోవడం, బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో మురికివాడల్లోని ప్రజలు ముక్కు మూసుకునే కాపురాలు చేసే పరిస్థితి నెలకొంది. నగరంలోని 48 మురికివాడల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రేణిగుంట - తిరుపతి మార్గంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పైప్‌లైన్ పగిలి రోడ్డు మొత్తం దెబ్బతింది. మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేసినా ఇరువైపులా మురుగుకాల్వలు నిర్మించలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలమయమయ్యాయి. మురికివాడలపై కార్పొరేటర్లకు ప్రత్యేక శ్రద్ధ లేకపోవడమే కారణంగా చెప్పవచ్చు.

అట్టహాసంగా ప్రెస్‌క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రంలో జర్నలిస్టులు అహర్నిశలు శ్రమిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండి మరింత అభివద్ధి జరగడానికి దోహదపడుతున్నారని, వారి సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం నగర పరిధిలోని కచ్చపి ఆడిటోరియంలో తిరుపతి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చంద్రగిరి, పూతలపట్టు శాసనసభ్యులు పులివర్తి నాని, కలికిరి మురళీమోహన్, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల వరప్రసాద్‌రావు, శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి సదాశివమూర్తి, ఎస్పీ సుబ్బరాయుడు, టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతిలో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపు విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ తిరుపతి ప్రెస్ క్లబ్ అభివద్ధికి చేదోడు వాదోడుగా తమ సహకారం అందిస్తామని, ప్రెస్ క్లబ్‌కు సొంతభవనం నిర్మించుకోవడానికి తిరుపతికి దగ్గరగా రూరల్ పరిధిలో స్థలం ఇప్పించడానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా తిరుపతిలో పనిచేసే జర్నలిస్టులకు సొంత ఇంటి స్థలం లేదని, జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి ఇంటి స్థలాల మంజూరుకు ఐక్య కార్యాచరణతో అర్హుల జాబితాను ఇస్తే తప్పనిసరిగా రాష్ట్ర ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ కె.బాబు పాల్గొన్నారు. కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు అన్నా రామచంద్రయ్య యాదవ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు వెట్రి శెల్వన్



రాష్ట్ర వాలీబాల్ పోటీలకు ఎంపికైన వెట్రిశెల్వన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మదనపల్లి జెడ్‌పి హైస్కూలులో ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ -14 బాలుర విభాగం లో వాలీబాల్ క్రీడల్లో పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం జెడ్‌పి హైస్కూలు 8వ తరగతి విద్యార్థి టి వెట్రి శెల్వన్ ఉత్తమ క్రీడా ప్రతిభ చూపి నవంబరు విజయనగరం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయు ఎ చంద్రశేఖర్‌శెట్టి, కమిటీ ఛైర్మన్ మణికంఠ తెలిపారు. పాఠశాల సహాయకులు సురేష్ ఆ విద్యార్థికి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థిని పిడి నంద కుమార్, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందనలు తెలుపుతూ పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

ఆర్‌డిఓ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కెవిబిపురం: కెవిబిపురం తహశీల్దారు కార్యాలయాన్ని శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం తిమ్మసముద్రం చెరువు ఆక్రమకు గురైనట్లు ఫిర్యాదు రావడంతో వెంటనే అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. అధికారులు వెంటనే సర్వే నిర్వహించి నివేదికలు అందించాలని ఆదేశించారు. మండలంలో ఎవరైనా చెరువులు, కాలువలు ఆక్రమణ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



కబ్జాకు గురైన చెరువును పరిశీలిస్తున్న ఆర్‌డివో భానుప్రకాష్

గర్భిణులకు, బాలింతలకు ఆహారం పంపిణీ



పౌష్టికాహారం అందిస్తున్న రోజా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలోని పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రతి బుధవారం వచ్చే గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఉచితంగా పౌష్టికాహారాన్ని ఆరేళ్లుగా మాజీ మంత్రి ఆర్‌కెరోజా అందిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా దాతృత్వం చాటుకుంటున్నారని పలువురు ప్రశంసిస్తున్నారు. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మునిసిపల్ ఛైర్మన్ హరి, కౌన్సిలర్లు దగ్గరుండి వడ్డించారు. నగరిలో డాక్టర్లు, కౌన్సిలర్ల ద్వారా పౌష్టికాహారాన్ని అందించారు. శుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు వారిని పరామర్శించేందుకు ఆమె తీసుకుంటున్న శ్రద్ధ ఆమె చిత్తశుద్ధికి నిదర్శనం.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ బాధితులు 30 మందికి పౌష్టిక హారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా డాక్టర్ సిఆర్‌రెడ్డి ఆరోగ్య సంకేమ ద్వారా డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోజాలి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధు, ప్రగతి సభ్యులు, మురళీ నాయుడు , శ్యామ్, కోట వెంకటేశ్వర్లు , నాగరాజు , కృష్ణ రెడ్డి, శ్రవణ్ , సాయి పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి నాయకుడు కళ్యాణ్‌రెడ్డి జన్మదినం

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని శిరసనం బేదుకు చెందిన టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీ కృష్ణారెడ్డి కుమారుడు, టిడిపి యువ నాయకుడు కళ్యాణ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఆ గ్రామ యువత ఘనంగా నిర్వహించింది. ఆయనకు శాలువా కప్పి పూల మాలలు వేసి కేకులు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అత్యంత కోలాహలంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ గ్రామ యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



టిడిపి నాయకుడు కళ్యాణ్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

టిటిడి ఛైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న శుభగిరినాయుడు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టిటిడి నూతన ఛైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన బొల్లినేని రాజగోపాల నాయుడును టిటిడి ప్రముఖ కాంట్రాక్టర్ బొల్లినేని శుభగిరి నాయుడు తిరుమలలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు. తిరుమలకు వచ్చి శ్రీవారి భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.

నైపుణ్య గణన సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఎంపిడివో కార్యాలయంలో సోమవారం ఉదయం నైపుణ్య గణన సర్వేను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఎస్ఎస్‌డిసి కోఆర్డినేటర్ చందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 -59 సంవత్సరాల మధ్య వున్న వారిలో నైపుణ్యతను గుర్తించి సర్వే చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఆనందబాబు రామకృష్ణ, టివోటిఎస్‌లు సురేష్, మనోజులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం: తహాశీల్దారు

ప్రజాశక్తి - కోట : భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామ రెవెన్యూ సభలు నిర్వహిస్తున్నామని తహాశీల్దారు జేజేరావు అన్నారు. బుధవారం కోట మండలంలోని తిన్నెలపూడి పంచాయతీ పరిధిలో సచివాలయం వద్ద టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిది కోట తహాశీల్దారు కటారి జేజే రావును గండవరం సుష్మా రెడ్డి శాలువా కప్పి గ్రామ సభకు ఆహ్వానించారు. పంచాయతీ పరిధిలో పలువురు రైతులు భూ సమస్యపై పలు అర్జీలు అందించారు. వీటిని పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని తహాశీల్దారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ మధులత, గ్రామ విఆర్‌ఓ తుపాకుల ఏడుకొండలు, సర్వేయర్ గోపిరెడ్డి, కేతంరెడ్డి నరేంద్ర రెడ్డి, టిడిపి మండల ఉపాధ్యక్షులు మర్రి అనీల్, సర్పంచ్ భర్త కర్లపూడి పెంచలయ్య, పంచాయతీ సెక్రటరీ రియాజుద్దిన్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీ కోదండ రామాలయ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి పురాతన శ్రీ కోదండ రామాలయ అభివృద్ధికి కృషి చేస్తానని చంద్రగిరి ఎమ్మెల్యే పులి వర్తి నాని పేర్కొన్నారు. చంద్రగిరి లోని శ్రీ కోదండ రామాలయాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని చంద్రగిరి అభివృద్ధి మండలితో కలిసి బుధవారం సందర్శించారు.అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాత్రికుల కోసం ఉచిత బస్సులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి అభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు కుమార్ రాజా రెడ్డి, ఎస్ గౌస్ బాషా, జెడ్‌పిటిసి యుగంధర్ రెడ్డి, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, మునిరత్నం రాయల్, వి రమేష్ రెడ్డి, సక్కూరి ధనుంజయ రెడ్డి, మనోహర్ రెడ్డి, మన్సూరు పాల్గొన్నారు.

మోసగాళ్లకు శిక్ష పడాలి: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాజీవ్ నగర్ లో ప్రభుత్వ సంపదను అప్పనంగా అమ్మేసి, దర్జాగా దొంగ సొమ్మును జేబులో వేసుకొన్న దోపిడీ రాయుళ్ళకు శిక్ష పడేలా చేయాలని టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దోపిడీ రాయుళ్లపై టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు.

ఆర్‌సిపురం మండల యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రామచంద్రాపురం: రామచంద్రాపురం మండల యుటిఎఫ్ అధ్యక్షులుగా లోకేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా పీవీఎస్ఎన్ రాజు, గౌరవ అధ్యక్షులుగా బాబు రెడ్డి, కోశాధికారిగా హరికృష్ణారెడ్డి, సహాధ్యక్షులుగా సిజి పరమేశ్వరి, రాజేష్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండలంలోని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ కార్యవర్గ ఎన్నికలు, స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కోశాధికారిగా రమేష్ నాయుడు, ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిర్మల, జిల్లా కార్యదర్శి పద్మజ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైళ్ల ప్రమాదాల నివారణకు..'కవచ్'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్రంలోని కీలక రైలు మార్గాల్లో ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు కవచ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. రెడ్ సిగ్నల్ను పట్టించుకోకుండా లోకో పైలెట్ రైలును ముందుకు నడిపితే.. ఈ వ్యవస్థ అప్రమత్తం చేసి, బ్రేక్‌లను తన నియంత్రణలోకి తెచ్చుకొని ప్రమాదాలను నియంత్రిస్తుంది. ఇలాంటి కీలకమైన కవచ్ వ్యవస్థ రేణిగుంట- మంత్రాలయం రోడ్డు, దువ్వాడ-విజయవాడ, విజయవాడ-గూడూరు మార్గాల్లో అందు బాటులోకి రానుంది.

ముఖ్యంగా రేణిగుంట -మంత్రాలయం రోడ్డు మార్గంలో ఎక్కువ రైళ్లు నడుస్తున్నాయి. ఈ మార్గంలో అత్యధిక ప్రయాణికులు ప్రయాణం రైళ్లలోనే చేస్తున్నారు. రోజుకు 150 పైగా ఎక్స్ ప్రెస్ రైళ్లు, ప్యాసింజర్ రైళ్లు, గూడ్స్ రైలు నడుస్తాయి. రేణిగుంట రైల్వే జంక్షన్ కావడంతో సరుకు రవాణా రైళ్లు కూడా అధికంగానే వస్తుంటాయి. ప్రమాదాల నివారణ కోసమే రైల్వే శాఖ కవచ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. రేణిగుంట మంత్రాలయం రోడ్‌లో ఎక్కువగా హైదరాబాదు ముంబై వెళ్లే ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. కవచ్ వ్యవస్థ వల్ల ఓ రైలు.. ఒక స్టేషన్ నుంచి బయలుదేరాక మరో స్టేషనుకు చేరేవరకు ఆ మార్గంలో ఇంకో రైలును పంపేందుకు అవకాశం ఉండదు. దీనివల్ల రైళ్ల నిరీక్షణ పెరిగిపోతోంది. దీనికి అడ్డుకట్టవేస్తూ ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ విధానాన్ని సైతం ఈ మూడు మార్గాల్లో అందుబాటులోకి తీసుకొస్తున్నారు. కవచ్, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్లకు కలిపి రైల్వేశాఖ రూ.2,104 కోట్లు కేటాయించింది.

'కవచ్'తో ప్రమాదాల నివారణ..

కవచ్ ద్వారా రైళ్లు సురక్షితంగా ప్రయాణించేందుకు వీలుంటుంది. ఈ వ్యవస్థలో ఎలక్ట్రానిక్, రేడియో ఫ్రీక్వెన్సీని గుర్తించే పరికరాలు ఉంటాయి. రైలు ఇంజిన్లలో, పట్టాలు, సిగ్నలింగ్ వ్యవస్థ, ప్రతి రైల్వే స్టేషన్లో వీటిని ఏర్పాటు చేస్తారు. ఇదంతా జీపీఎస్‌తో అనుసంధానమై పనిచేస్తుంది. లోకో పైలెట్ (రైలు డ్రైవర్) రెడ్ సిగ్నల్ వద్ద ఆగకుండా ముందుకు వెళితే, కవచ్ వ్యవస్థ అప్రమత్తమవుతుంది. బ్రేక్లను తన నియంత్రణలోకి తెచ్చుకుంటుంది. అదే లైన్లో ఏదైనా రైలు వస్తున్నట్లు తెలిస్తే వెంటనే రైలుని ఆపేస్తుంది.

వాడి-గుంతకల్లు-రేణిగుంట మార్గంలో 538 కి.మీ.లో కవచ్ మంజూరుకాగా, ఇందులో మన రాష్ట్ర పరిధిలోని 402 కి.మీ. ఉంది. ప్రస్తుతం రాష్ట్రమంతటా ఇంటర్మీడియట్ బ్లాక్ (ఐబీ) సిగ్నలింగ్ విధానం ఉంది. అంటే ఓ రైలు మొదటి స్టేషన్లోని డిస్పాచ్ సిగ్నల్ దాటి బయలుదేరి, తర్వాత స్టేషన్లోని హోం సిగ్నల్లోకి చేరుకునేవరకు.. అదే లైనులో వెనుక మరొక రైలును పంపరు. ఇలా రెండు స్టేషన్ల మధ్య దూరం ఎక్కువ ఉంటే.. వెనుక స్టేషన్లో రైళ్లు ఆగిపోవాల్సి ఉంటోంది. ఉదాహరణకు సమీపంలోని రేణిగుంట-మామండూరు మధ్య 7 కి. మీ. కాగా ఓ రైలు శ్రీకాళహస్తి లో బయలుదేరి రేణిగుంట చేరుకునే వరకు.. వెనుకొచ్చే రైలుకు రేణిగుంటలో గ్రీన్ సిగ్నల్ లభించదు.

ఇటువంటి ఐబీ సిగ్నలింగ్ స్థానంలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ విధానం తీసుకొస్తున్నారు. రెండు స్టేషన్ల మధ్య దూరాన్ని బ్లాక్ లుగా విభజించడంతో,

ఆటోమేటిక్ సిగ్నలింగ్ అందుబాటులోకి..



ఆ బ్లాక్ దాటగానే ఆటోమేటిక్‌గా వెనుక మరొక రైలుకు సిగ్నల్ లభిస్తుంది. ఉదాహరణకు గుణదల-ముస్తాబాద్ మధ్య 7 కి. మీ. దూరంలో నాలుగు బ్లాక్ లు ఏర్పాటు చేశారు. దీనివల్ల గుణదలలో బయలుదేరి రైలు ముస్తాబాద్ చేరుకునేలోపు వెనుక మరో నాలుగు రైళ్లను పంపేందుకు వీలుంటుంది. దువ్వాడ- విజయవాడ మార్గంలో ఇప్పటికే రాష్ట్రంలోని విజయవాడ- నూజివీడు, నిడదవోలు- కడియం, నర్సింగపల్లి-తాడి స్టేషన్ల మధ్య ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ విధానం అందుబాటులోకి వచ్చింది. మిగిలిన భాగంలో కూడా దీనిని ఏర్పాటు చేయనున్నారు. కవచ్ ఏర్పాటు, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ పనులన్నీ 2026 -2027 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తిచేయాలని రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

క్రీడా హబ్‌గా తిరుపతి

జిల్లాలో క్రీడా సదుపాయాలపై కలెక్టర్‌తో శాప్ ఛైర్మన్ భేటీ



కలెక్టర్‌ను కలిసిన శాప్ చెరన్ రవినాయుడు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: క్రీడా హబ్‌గా తిరుపతి జిల్లాను తీర్చిదిద్దుతామని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. క్రీడాంధ్రప్రదేశ్ లక్ష్యంగా దేశంలోనే అత్యుత్తమంగా స్పోర్ట్స్ పాలసీని రూపొందించామని, పాలసీల నిర్వహణను కూడా పక్కా ప్రణాళికతో అమలు చేస్తామని పేర్కొన్నారు. తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌ను తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నరసింహ యాదవ్‌తో పాటు శాప్ ఛైర్మన్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఇటీవల ఆమోదించిన స్పోర్ట్స్ పాలసీకి సంబంధించిన అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. స్పోర్ట్స్ పాలసీలో భాగంగా తిరుపతి జిల్లాలో అమలు చేయనున్న విధానాలను వెల్లడించారు. తిరుపతి జిల్లాలో వరల్డ్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి 32 ఎకరాలు అవసరమవుతుందని, స్థలాన్ని కేటాయించాలని శాప్ ఛైర్మన్ కలెక్టర్‌ని కోరారు. స్మార్ట్ సిటీ నిధులతో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో మరమ్మతులు, సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా శ్రీకాళహస్తి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రహరీ నిర్మాణం, జిల్లాలో క్రీడారంగం అభివృద్ధికి సెస్ నిధులు, అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. నూతన క్రీడావిధానం అమలుకు అధికార యంత్రాంగం తోడ్పడితే క్రీడారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు రావచ్చని ఆకాంక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతిని క్రీడారంగానికి వేదికగా తీర్చిదిద్దుతామన్నారు. పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఎస్డీఓ సయ్యద్ సాహెబ్ పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో శ్రీ గాయత్రి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూలులో 4వ తరగతి విద్యార్థి యశ్విన్ తమిళనాడు ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో అండర్ 9, 11 విభాగాలలో ప్రథమ స్థానం సాధించి , రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయిందని ఆ స్కూలు కరస్పాండెంట్ ఎం శివకుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా యస్విన్‌ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు నుండి రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీకి ఎంపిక కావడం అభినందనీయమని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీడీ చైతన్య , ఉపాధ్యాయులు మస్తాన్ బీ, సుప్రజ , రఫీ , హరిత , నాసీరా, ధనశ్రీ, సుప్రియ, సమ్రిన్, శిరీష, ఉమ, హరిత, ఝాన్సీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



యశ్విన్‌ను అభినందిస్తున్న శ్రీగాయత్రీ స్కూలు ఉపాధ్యాయ బృందం

' సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి'

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సైబర్ మోసాలకు గురి కాకుండా అప్రమత్తంగా వుండాలని హైద్రాబాద్‌కు చెందిన సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ నరసింహారావు పేర్కొన్నారు. గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో 'సైబర్ మోసాలు- అప్రమత్తత'పై విద్యార్థులకు బుధవారం అవగాహన కలిగించారు. విద్యార్థులకు సైబర్ మోసాల అప్రమత్తతపై అవగాహన కల్పించారు. డిఎస్‌పి వివి రమణ కుమార్ మాట్లాడుతూసైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వుండాలన్నారు. మొబైల్స్ మెసేజ్‌ల ద్వారా, ఆన్ లైన్ ద్వారా ఈ మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. చాలా మంది నగదు పోగొట్టుకున్నారని, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్, గూడూరు, వాకాడు సీఐలు కిషోర్ బాబు, శేఖర్ బాబు, ఎస్ఐలు, ఎవో కొండారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నరసింహారావు

సూళ్లూరుపేట: స్థానిక గోకుల్ కృష్ణ ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థులకు సైబర్ క్రైమ్స్ నిపుణులు ఐఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో సైబర్ మోసాల అప్రమత్తతపై బుధవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు గురించి ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్ట్‌లు, లోన్ యాప్స్, స్మార్ట్ ఫోన్స్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పార్సెల్ మోసాలు, ఫేక్ వాయిస్ కాల్స్, ఫేక్ వాట్సాప్ కాల్స్, గూగుల్ సెక్యూరిటీపై, మెయిల్స్ మోసాలు, పాస్‌వర్డ్ మోసాలు, డిజిటల్ ఫుట్ ప్రింట్స్, క్రెడిట్ కార్డు, ఎటిఎం కార్డ్స్ మోసాలు గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సైబర్ మోసాలకు గురి కాకూడదని నాయుడుపేట డిఎస్‌పి చెంచుబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్ సురేష్, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడు పాల్గొన్నారు.

జాతీయ వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్-ప్రీరిపబ్లిక్ పరేడ్‌కు వేదవ్యాస విద్యార్థిని

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జాతీయ స్థాయి వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ - ప్రీరిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్-2024 కు వేదవ్యాస డిగ్రీ కళాశాల బికాం తృతీయ సంవత్సరం విద్యార్థిని పి భావన ఎంపికైందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ అనిల్ కుమార్ తెలిపారు.ఎస్వి యూనివర్శిటీ లో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ వాలంటరీ ఎంపికలో యూనివర్సిటీ స్థాయిలో భావన వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ మహారాష్ట్ర క్యాంప్ - 2024 కి ఎంపికైంది. వేదవ్యాస డిగ్రీ కళాశాల నుండి భావన ఎంపిక కావడం పట్ల కళాశాల కరస్పాండెంట్ సి బాలసరస్వతి, డైరెక్టర్ నారాయణబాబు, వేదవ్యాస్, ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ యుగంధర్, అధ్యాపకులు విద్యార్థిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచండి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): రైతులు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అందించే రాయితీ వ్యవసాయ యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోహర్ బాబు కోరారు. మండలంలోని డోర్నకంబాల, గంగుడుపల్లి గ్రామ పంచాయతీలలో పొలం పిలుస్తోంది'ని బుధవారం నిర్వహించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకుని వ్యవసాయ పంటలను సాగు చేయాలన్నారు. రైతులు పొలాల్లో పండించే పంటలకు కేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచాలని మండల ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ అన్నారు. ఉద్యానవన పంటలకు సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే వాటి ఉపయోగాలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. మామిడి సాగులో సస్యరక్షణ చర్యలపై మామిడి రైతులకు శిక్షణ ఇచ్చారు. రసాయన ఎరువులు వల్ల పంట దిగుబడి, నాణ్యత తగ్గుతుందన్నారు. వర్షాకాలంలో పాడి రైతులు పాడి పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మండల పశు వైద్యాధికారి వినోద్ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ భాస్కర్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కోట : వ్యవసాయ పంటలపై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి వి నిరంజన్ కుమార్ అన్నారు. కోట మండలంలోని కొత్తపట్నం, సిద్దవరం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది'ని బుధవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్ రైతులతో మాట్లాడుతూ ఒక ఎకరా ప్రధాన పొలంకి 5 సెంట్లు నారుమడి ఏర్పాటు చేసుకొని 2కేజీ నత్రజని (విత్తనం చల్లేముందు 1కేజీ విత్తనం, విత్తిన 15 రోజులు ముందు మరొక 1కేజీ),1కేజీ భాస్వరం,1కేజీ పొటాష్ నిచ్చే ఎరువులు దుక్కిలో వేయాలన్నారు. జింక్ లోపాన్ని గుర్తించి తగిన జాగత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.నిరంజన్ కుమార్,గ్రామ వ్యవసాయ సహాయకులు పి.రవికుమార్,గ్రామ మత్స్యశాఖ సహాయకులు బి.నాగరాజు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్ సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి ఆర్‌టిసి సెంట్రల్ బస్టాండ్‌లో మూడు కొత్త బస్సు సర్వీసులను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీ తిరుపతి కేంద్రంగా తిరుపతి కాణిపాకం మధ్య రెండు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సులను, తిరుపతి సత్యవేడు మధ్య తిరుపతి నుండి ఒక ఆర్డినరీ సర్వీసును ఏర్పాటు చేశారన్నారు. దీంతో తిరుపతి కాణిపాకానికి ఇప్పటికే 14 సర్వీసులు ఉన్నాయని, ఈ రెండిటితో కలిపి 16 సర్వీసులు అవుతాయన్నారు.



ఆర్‌టిసి బస్సు సర్వీసులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి నుంచి సత్యవేడుకు ఒక ఆర్డినరీ ఇప్పటికే వుందని, మరో బస్సును అదనంగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహ యాదవ్, జనసేన నాయకులు డాక్టర్ పసుపు లేటి హరిప్రసాద్, రాజారెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి బాలాజీ, ఆర్‌టిసి అధికారులు జగదీష్, డిపో సూపరువైజర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడిని శిక్షిస్తాం'

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: వడమాల పేట మండలంలో మూడున్నర ఏళ్ల బాలిక పై జరిగిన అఘాయిత్యానికి ప్రభుత్వం సకాలంలో స్పందించి చర్యలు తీసుకుందని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్.టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. బుధవారం ఆయన తిరుపతి జిల్లాలోని వడమాల పేట మండలం ఏ.ఎం పురం ఎస్‌టి కాలనీలో పర్యటించారు. ఆరు రోజుల క్రితం మూడున్నర ఏళ్ల పసి పాప పై జరిగిన సంఘటన గురించి మాట్లాడుతూ.. నిరుపేద గిరిజన యానాది కుటుంబానికి చెందిన వీరికి న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పెషల్ కేస్ కింద పరిగణలోనికి తీసుకొని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. అనంతరం నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను బాధితులకు అందించారు. బతుకుదెరువు కోసం ఉద్యోగావకాశం కల్పించాలని, కెవిబిపురంలో ఇంటి స్థలంతో పాటు ఇల్లు కట్టించి ఇవ్వాలని తల్లిదండ్రులు కోరారు. ఈ కార్యక్రమంలో డిటిడబ్ల్యుఒ బి.సూర్య నారాయణ, డిఎస్‌పి రవికుమార్, సిఐ భాస్కర్‌నాయక్, ఎస్ఐ అమరనాథరెడ్డి, ఎంపిడిఒ శేషగిరిరావు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై వినతి

తిరుపతి పద్మావతి గెస్ట్‌హౌస్‌లో వడిత్యా శంకర్‌నాయక్‌ను గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హరినాథ్, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఈశ్వరమ్మ, చీరాలయ్య కలిసి వినతిపత్రం ఇచ్చారు. సూళ్లూరుపేట నియోజకవర్గం దొరవారిసత్రం మండలం తనియాలి ఎస్టీ కాలనీ గిరిజనులు సాగు చేసుకుంటున్న 100 ఎకరాలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కల్లూరు ఎస్టీ కాలనీలో 135 ఎకరాలను 40 కుటుంబాల వారికి పట్టాలివ్వాలని ఎస్టీ కమిషన్ ఆదేశించినా ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. చిట్టమూరు ఎస్టీ కాలనీ గిరిజనులు సాగు చేసుకుంటున్న 500 ఎకరాల భూమిని గిరిజనులకు పట్టాలివ్వాలన్నారు. ఓజిలి మండలం కొందాం రాజుపాలెం ఎస్టీ కాలనీకి చెందిన 22 మందికి సర్వే నంబర్ 1లో 1266 ఎకరాలు మేతపోరంబోకు భూమి అగ్రవర్ణాలు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లి గ్రామానికి సిసి రోడ్డు వేయాలని కోరారు. మల్లిమడుగు డ్యాంలో చేపలు వదిలి పట్టుకునే అవకాశాన్ని గిరిజన యానాదులకు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

వైసీపీ అధ్యక్షురాలు కవిత ఐపి దాఖలు

లబోదిబోమంటున్న రుణదాతలు

ప్రజాశక్తి -రామచంద్రపురం: మండలంలోని చుట్టుగుంట రామాపురానికి చెందిన మండల వైసిపి అధ్యక్షురాలు కవిత పుత్తూరు సివిల్ జడ్జి కోర్టులో ఐపి పెట్టేందుకు మంగళవారం పిటిషన్ దాఖలు చేసింది. కవిత టైలరింగ్ కేంద్రం, చీటీలు నడుపుతూ జీవనం సాగించేది. ఈ తరుణంలో రుణదాతల నుండి వ్యాపారం పేరుతో సుమారు కోటి రూపాయలకు పైగా అప్పు చేసిందని రుణతాతలు తెలిపారు. అందులో కొంత మందికి అప్పులు చెల్లించింది. 18 మందికి రూ.35 లక్షల రూపాయలు అప్పు చెల్లించాల్సి ఉందని. టైలరింగ్ వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఆమె రుణదాతల ఒత్తిడి తట్టుకోలేక ఐపి దాఖలు చేసినట్లు న్యాయవాది విజయ శేఖర్ తెలిపారు. విషయం తెలుసుకున్న రుణ దాతలు బుధవారం సాయంత్రం సి రామాపురంలోని కవిత ఇంటి వద్దకు వచ్చి లబోదిబోమంటూ నోరు కొట్టుకుంటున్నారు. నానా కష్టాలు పడి సంపాదించి కూడబెట్టుకున్న డబ్బును రుణంగా తీసుకొని ఐపి పెడితే ఎలా?' అంటూ ఆమె ఇంటి ముందు గుమి గూడారు. ఆమె ఇంట్లో లేకపోవడంతో తమను నమ్మించి లక్షల రూపాయలు అప్పుగా తీసుకుని మోసం చేసింద సి రామాపురంలో మొట్టమొదట తీసుకున్న అప్పు ఇవ్వకుండా ఐపీ పెట్టిన మోసకారి అని రుణ దాతలు కన్నీరు పెట్టుకొని వెళ్లిపోయారు.

విద్యుత్ పంపిణీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, ఆపరేషన్ సర్కిల్, తిరుపతి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా నెల్లేపల్లి మధుసూదన రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదవి తనకు అప్పజెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు కు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ,చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆ సంస్థ సీఎండీ కె.సంతోష రావ్‌కు, నెల్లేపల్లి మధుసూదన రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులకు అందుబాటులో ఉండి ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులు,అభిమానులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- ఉచిత మెగా డిఎస్‌సి కోచింగ్ పరీక్షల నిర్వహణ సమీక్షలో కలెక్టర్

ప్రజాశక్తి - క్యాంపస్ : ఉచిత మెగా డిఎస్ సి కోచింగ్‌కు నిర్వహించే ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టరు ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో త్వరలో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ రానున్న సందర్భంగా ఉచిత కోచింగ్ నిర్వహణకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహణకు సంబంధిత అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10 వ తేదీన ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాలు తిరుపతిలో చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల, పుత్తూరు సమీపంలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షా సమయం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వుంటుందని అభ్యర్థులు జ్ఞాన భూమి వెబ్‌సైట్‌లో హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకొని పరీక్షా కేంద్రాలకు 10 గంటల లోపుగా చేరుకోవాలన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): యుటిఎఫ్ చంద్రగిరి మండల కార్యవర్గ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చంద్రగిరి మండల యూటీఎఫ్ అధ్యక్షులుగా రాజేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శిగా ఆర్ ధనంజయ, గౌరవ అధ్యక్షులుగా కె రామిరెడ్డి, కోశాధికారిగా కె చెంచయ్య, సహాధ్యక్షులుగా పి లక్ష్మి ఎస్ హరికుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు..

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట: సీఐ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని సిఐ తిమ్మయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన పెన్నలపాడు ఇసుక రీచ్‌ను పరిశీలించారు. అక్కడ ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లను ఆపి రికార్డులు లైసెన్సులు తనిఖీ చేశారు. అనంతరం డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రభుత్వం నిర్దేశించిన రీచ్ ల నుంచి ఇసుక తరలింపు చేపట్టవచ్చనీ, కేవలం ట్రాక్టర్ల ద్వారానే తరలించాలని తెలిపారు. జెసిబిలు, టిప్పర్లకు, లారీలకు అనుమతి లేదన్నారు. మద్యం సేవించి అధిక వేగంతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి వేళల్లో ఇసుక తరలింపు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్వారీని అడ్డుకోవడం సరికాదు: సీఈవో

ఋజాశక్తి - ఓజిలి : వ్యక్తిగత సమస్యలను దృష్టిలో పెట్టుకొని అనుమతులు అన్ని ఉన్న క్వారీపై వ్యక్తిగతంగా అడ్డుకోవడం సరి కాదని క్వారీ సీఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని ఆర్మీపాడు క్వారీకి అన్ని అనుమతులు ఉన్నాయని, కావాలని కొందరు వ్యక్తులు వ్యక్తిగతంగా తీసుకొని క్వారీని అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు.